సాక్షి
చిత్తూరు
ఆదివారం । 23 । జూన్ । 2024



హనుమంతుడిపై శ్రీహరి

శ్రీప్రసన్న వేంకటేశ్వరస్వామి హనుమంత, గజ వాహనాలపై విహరిస్తూ భక్తులను కటాక్షించారు.

- 8లో



గణపతి హోమంతో సకల శుభాలు

కాణిపాకం ఆలయంలో జరుగుతున్న గణపతి హోమంతో సకల శుభాలు కలుగుతాయని అర్చకులు తెలిపారు.

- 8లో



విజయవంతం చేయండి

సీఎం చంద్రబాబు పర్యటనను విజయవంతం చేయాలని కలెక్టర్ షణ్మోహన్, ఎస్పీ మణికంఠ కోరారు.

- 8లో

అడ్డదిడ్డంగా తవ్వకాలు..
అడ్డొస్తే బెదిరింపులు

అధికారంలోకి వచ్చి రోజులు గడవకముందే టీడీపీ నేతలు అక్రమ సంపాదన కోసం అవురావురమంటూ అడుగులు వేస్తున్నారు. ప్రకృతి సంపదను కొల్లగొట్టి జేబులు నింపుకునేందుకు సిద్ధమైపోయారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని పలు మండలాల్లో ఇప్పటికే గ్రావెల్, మట్టి, ఇసుక దందాకు శ్రీకారం చుట్టేశారు. నాడు నేషనల్ గ్రీన్ ట్రిబ్యూనల్ అభ్యంతరం వ్యక్తం చేసిన చోటే తవ్వకాలు ఆరంభించేశారు. మరో వైపు గతంలో టెండర్ పాడుకున్న వారు నిల్వచేసిన ఇసుకను ఎత్తుకెళ్లేందుకు ప్రణాళికను రచించేశారు. ఏమైనా అంటే 'ఎమ్మెల్యే తాలూకు.. మనుషులం'అంటూ బెదిరింపులకు దిగుతున్నారు. శనివారం 'సాక్షి' పరిశీలనలో అడుగడుగునా కనిపించిన అక్రమ తవ్వకాలు.. దోపిడీలపై స్పెషల్ ఫోకస్..

- ప్రకృతి వనరులను కొల్లగొడుతున్న కూటమి నేతలు
- ఉమ్మడి జిల్లాలో ఇష్టారాజ్యంగా గ్రావెల్, మట్టి, ఇసుక తవ్వకాలు
- వ్యవసాయ భూముల్లో రైతుల అనుమతి లేకున్నా దౌర్జన్యాలు
- పెళ్లకూరు, నాగలాపురం, పూతలపట్టు మండలాల్లో రెచ్చిపోతున్న తెలుగు తమ్ముళ్లు
- కన్నెత్తి చూడని రెవెన్యూ, మైనింగ్ శాఖలు



పూతలపట్టు మండలం, వావిల్ తోట నుంచి ట్రాక్టర్ల ద్వారా అక్రమంగా ఇసుక తరలిస్తున్న టీడీపీ నేతలు

సాక్షి టాస్క్‌ఫోర్స్

సాక్షి, టాస్క్‌ఫోర్స్: ఉమ్మడి చిత్తూరు జిల్లా వ్యాప్తంగా కూటమి శ్రేణులు గ్రావెల్, ఇసుక, మట్టిని ఇష్టారాజ్యంగా తవ్వి సొమ్ము చేసుకుంటున్నారు. సూళ్లూరుపేట నియోజకవర్గం, పెళ్లకూరు మండల పరిధిలోని నందిమాల, ఎర్రగుంట, శిరసనంబేడు, రోసనూరు, రాజుపాళెం, అర్ధమాల, పునబాక తదితర గ్రామాల్లో గ్రావెల్‌ను వేల క్యూబిక్ మీటర్ల వరకు గ్రావెల్‌ను తవ్వేస్తున్నారు. భారీ యంత్రాలతో టిప్పర్లు, ట్రాక్టర్లు, లారీలకు నింపుకుని ప్రైవేటు కంపెనీలకు విక్రయించి జేబులు నింపుకుంటున్నారు. శిరసనంబేడు గ్రామంలోని సిద్ధేశ్వర స్వామి కొండ సమీపంలో అసైన్డ్ భూముల్లో అక్రమ గ్రావెల్ తవ్వకాలు చేపడుతున్నారు. నాయుడుపేట పరిసరాల్లో లేఅవుట్లు, మేనకూరు సెజ్‌లో పరిశ్రమలకు, 71వ జాతీయ రహదారి రోడ్డు అభివృద్ధి పనులకు గ్రావెల్, మట్టికి మంచి డిమాండ్ ఉండడంతో టీడీపీ నేతలు ఇదే అదునుగా రెచ్చిపోతున్నారు. యంత్రాలతో తవ్వకాలు చేపట్టినా మామూళ్ల మత్తులో జోగుతున్న కొందరు అధికారులు అటు వైపు కన్నెత్తి చూడడం లేదు.



నాగలాపురం : ఎమ్మెల్యే తాలూకా.. మనుషులమంటూ పోలీసులతో మాట్లాడుతున్న టీడీపీ నేతలు



ఎర్రగుంట చెరువులో యంత్రాలతో గ్రావెల్ తవ్వకాలు

డోంట్ కేర్

శిరసనంబేడు, రోసనూరు, అర్ధమాల, నందిమాల, ఎర్రగుంట గ్రామ పరిసరాల్లో గ్రావెల్ తవ్వకాలు చేపట్టరాదన్న కోర్టు ఆదేశాలు ఉన్నాయి. కానీ ఇక్కడి టీడీపీ నేతలు అవేవీ పట్టించుకోవడం లేదు. మరో వైపు 5వేల క్యూబిక్ మీటర్లకు మాత్రమే గ్రావెల్ తవ్వాలకు అనుమతి ఉన్నా.. 50 వేల క్యూబిక్ మీటర్లకు పైగా తవ్వకాలు చేపడుతున్నారు.

నిల్వ ఉంచిన ఇసుకను ఎత్తుకెళ్లేందుకు స్కెచ్

సత్యవేడు నియోజకవర్గం, నాగలాపురం మండలంలోని సుబ్బానాయుడుకండ్రిగ ఇసుక రీచ్‌ని గతంలో కాంట్రాక్టర్ టెండర్ దక్కించుకున్నారు. ఎన్నికల కోడ్ రాక ముందు వరకు తవ్విన ఇసుకను నిల్వచేశారు. కోడ్ రావడంతో ఇసుక తరలించడాన్ని నిలిపివేశారు. ఆ భారీ ఇసుక డంప్‌పై కన్నుపడ్డ టీడీపీ నేతలు శనివారం టిప్పర్లు, ట్రాక్టర్లను దించారు. స్థానిక ఎమ్మెల్యే తాలూకా.. మనుషులమంటూ వాహనాల్లో ఇసుకను నింపుకున్నారు. విషయం తెలుసుకున్న స్థానికులు పోలీసులకు సమాచారమిచ్చారు. రీచ్‌కు చేరుకున్న పోలీసులు వాటి గురించి ఆరాతీయగా.. ఎమ్మెల్యే పంపారని, అందుకే వచ్చామంటూ హడావుడి చేశారు. అనుమతి పత్రాలు కోరడంతో అక్రమార్కులు అన్‌లోడ్ చేసి అక్కడి నుంచి వెనుదిరిగారు. ఎమ్మెల్యే పేరు చెప్పడంతో పోలీసులు వారిపై ఎటువంటి చర్యలు తీసుకోలేదు.



నాగలాపురం : సుబ్బానాయుడు కండ్రిగ రీచ్‌లో నిల్వ ఉంచిన ఇసుకను వాహనాలకు నింపిన టీడీపీ నేతలు

పూతలపట్టులో బరితెగింపు

చిత్తూరు జిల్లా, పూతలపట్టు పరిధిలోని వావిల్ తోట ఇసుక రీచ్‌లో టీడీపీ నేతలు విచ్చల విడిగా తవ్వకాలు చేపట్టారు. వందల ట్రాక్టర్ల ద్వారా ఇసుకను అక్రమంగా తరలించి సొమ్ముచేసుకునే పనిలో నిమగ్నమయ్యారు. ఎన్నికలకు ముందు వావిల్ తోటలో ఇసుక తవ్వకాలు చేపట్టడానికి వీల్లేదని చిత్తూరు జాయింట్ కలెక్టర్ ఆదేశాలు జారీచేశారు. ఎన్నికల ఫలితాల తర్వాత ఆ నిబంధనను టీడీపీ నేతలు తుంగలో తొక్కేశారు. గత కొద్ది రోజులుగా ఇక్కడ ఇష్టారాజ్యంగా ఇసుక తవ్వకాలు చేపట్టారు. వందల సంఖ్యలో ట్రాక్టర్ల ద్వారా ఇసుకను తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. మరో టీడీపీ నేత ఇదే పూతలపట్టు మండలం, అబ్బిరెడ్డి ఊరు సమీపంలోని వంకలో ఇసుకను అక్రమంగా తవ్వి మూర్తిగానూరు గ్రామంలో డంప్ చేసుకున్నారు. శుక్ర, శనివారాల్లో మాత్రమే సుమారు 120 ట్రాక్టర్ల వరకు డంప్ చేసినట్లు స్థానికులు గుర్తించారు. ఈ విషయంపై సంబంధిత అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

చర్యలు చేపడుతాం

శిరసనంబేడులోని సిద్ధేశ్వరకొండ, యర్రగుంట, నందిమాల చెరువులు, రోసనూరు, అర్ధమాల అటవీ భూములు, పలు ప్రాంతాల్లోని అసైన్‌మెంట్ భూముల్లో అక్రమ తవ్వకాలపై ఫిర్యాదులు వస్తున్నాయి. జిల్లా మైనింగ్ అధికారులతో మాట్లాడి అక్రమ తవ్వకాలకు పాల్పడుతున్న వారిపై చర్యలు చేపడుతాం.

–చంద్రముని, సూళ్లూరుపేట ఆర్డీఓ



టిప్పర్లకు గ్రావెల్ నింపుతూ..



ఎర్రగుంట చెరువులో ఏర్పడిన ప్రమాదకర గుంతలు



సుబ్బానాయుడు కండ్రిగ ఇసుక రీచ్



యంత్రాలతో గ్రావెల్ తవ్వకాలు

న్యూస్‌రీల్

నూతన కలెక్టర్‌గా సుమిత్‌కుమార్



చిత్తూరు కలెక్టరేట్ : చిత్తూరు జిల్లా నూతన కలెక్టర్‌గా సుమిత్‌కుమార్ నియమితులయ్యారు. ఈ మేరకు శనివారం రాత్రి రాష్ట్రప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. ఆ మేరకు పశ్చిమ గోదావరి జిల్లా కలెక్టర్‌గా పనిచేస్తున్న సుమిత్ కుమార్‌ను చిత్తూరుకు, ఇక్కడ పని చేస్తున్న కలెక్టర్ షణ్మోహన్‌ను కాకినాడకు బదిలీ చేశారు. గతేడాది ఏప్రిల్‌లో షణ్మోహన్ చిత్తూరు కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టారు. సార్వత్రిక ఎన్నికలను సమర్థవంతంగా నిర్వహించారు.

మధ్యతరగతి కుటుంబం నుంచి..

నూతన కలెక్టర్‌గా నియమితులైన సుమిత్‌కుమార్ 2014వ ఐఏఎస్ బ్యాచ్‌కు చెందిన వారు. హర్యాణాలోని రోహతక్ జిల్లాలోని కోసూర్‌లో మధ్యతరగతి కుటుంబంలో జన్మించిన ఈయన 2014లో సివిల్స్ సాధించారు. జిల్లాల విభజన అనంతరం అల్లూరి సీతారామరాజు జిల్లా, ప్రస్తుతం పశ్చిమ గోదావరి జిల్లా కలెక్టర్‌గా పని చేస్తూ ఇక్కడికి బదిలీ అయ్యారు. రెండు, మూడు రోజుల్లో బాధ్యతలు స్వీకరించనున్నారు.

సమావేశానికి ఎందుకు రాలేదు ?

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా అధికారులు సమావేశం నిర్వహిస్తే హాజరవ్వడం తెలియదా ? అంటూ డీఈఓ దేవరాజుపై కలెక్టర్ షణ్మోహన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. సీఎం పర్యటన, పలు అంశాలపై శనివారం కలెక్టరేట్‌లో జిల్లా అధికారులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి డీఈఓ గైర్హాజరు కావడంపై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. సమావేశానికి ఎందుకు రాలేదని ప్రశ్నించారు. సమావేశాలకు ఎటువంటి ముందస్తు అనుమతి లేకుండా గైర్హాజరైతే కఠిన చర్యలుంటాయని కలెక్టర్ హెచ్చరించారు.

ట్రాన్స్‌జెండర్ల సంరక్షణకు ప్రత్యేక ఉత్తర్వులు

చిత్తూరు కలెక్టరేట్ : విద్యాసంస్థల్లో ట్రాన్స్‌జెండర్ల సంరక్షణకు రాష్ట్రప్రభుత్వం ప్రత్యేక ఉత్తర్వులను శనివారం జారీ చేసింది. ఎన్‌హెచ్‌ఆర్‌సీ అడ్వైజరీ ఆదేశాల మేరకు ఉత్తర్వులు జారీ చేసినట్లు చెప్పారు. యాంటీ డిస్క్రిమినేషన్ సెల్‌ను ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. మానిటరింగ్‌కు కమిటీని ఏర్పాటు చేసి, ఈ ఉత్తర్వులను అమలు చేసేందుకు డీఈఓ ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు.

పిల్లలను పనుల్లో పెట్టుకుంటే చర్యలు

చిత్తూరు కలెక్టరేట్ : పిల్లలను నిబంధనలకు విరుద్ధంగా పనుల్లో పెట్టుకుంటే చర్యలు తప్పవని జిల్లా సమగ్రశిక్ష శాఖ ఏఎల్ఎస్ కోఆర్డినేటర్ అజయ్‌కుమార్‌రెడ్డి అన్నారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా నేను బడికి పోతా కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇప్పటివరకు బడికి వెళ్లని 42 మంది విద్యార్థులను గుర్తించి, 26 మందిని స్కూళ్లలో చేర్పించామని తెలిపారు.

నష్టాల పాలు

పదిలీటర్ల పాలిచ్చే ఆవును కొనాలంటే లక్షకు పైమాటే. ఆ పాడి ఆవును సంరక్షించి పాలను విక్రయిస్తే లీటరుకు దక్కేది రూ.25 మాత్రమే. అదే పాలను మనం దుకాణాల్లో కొనాలంటే లీటర్‌కు రూ.70 పెట్టాల్సిందే. కనీసం మంచినీళ్ల బాటిళ్లకైనా గ్యారెంటీ ధరలు ఉంటున్నాయి కానీ స్వచ్ఛమైన పాలకు మాత్రం గ్యారెంటీ లేకుండా పోయింది. పాల ఉత్పత్తి పెరిగిందంటూ డెయిరీ నిర్వాహకులు రింగ్‌గా ఏర్పడి పాలను కొనట్లేదు. దీంతో పాడి రైతులకు నష్టాలు తప్పట్లేదు.

- ఉత్పత్తి పెరిగిందంటూ పాలను కొనుగోలు చేయని డెయిరీ నిర్వాహకులు
- రింగ్‌గా ఏర్పడి పాల రేట్లను తగ్గించిన వైనం
- రైతులకు భారంగా మారిన పాడి ఆవుల పెంపకం
- గిట్టుబాటు కాని పాల ధరతో నష్టాల బాటలో రైతులు

జిల్లాలో పాడి వివరాలు..

- జిల్లాలోని ప్రైవేటు పాల డెయిరీలు పదిదాకా ఉన్నాయి
- మిల్క్ చిల్లింగ్ సెంటర్లు 60
- పాడిరైతులు 88 వేల మంది దాకా
- రోజుకు పాల ఉత్పత్తి 4 లక్షల లీటర్ల వరకు..



పాలను పితుకుతున్న మహిళ

పలమనేరు: మొన్నటి దాకా జిల్లాలోని ప్రైవేటు డెయిరీలలో లీటర్ పాల ధర రూ.44 ఉండగా, ఇప్పుడు లీటర్ పాలు కేవలం రూ.25 నుంచి రూ.30కే దొరుకుతున్నాయి. డెయిరీల సామర్థ్యానికి మంచి పాలు వస్తున్నాయని నిర్వాహకులు పాల ధరలను అమాంతం తగ్గించేశారు. ప్రైవేటు పాల డెయిరీల నిర్వాహకులు రింగ్‌గా ఏర్పడి ధరల తగ్గించేశారని, రైతులు, పాల సేకరణ ఏజెంట్లు ఆరోపిస్తున్నారు. రైతులు డెయిరీలకు వేసే పాల ధర తగ్గినపుడు దుకాణాల్లో విక్రయించే పాల ధర మాత్రం ఎందుకు తగ్గడం లేదని పాడిరైతులు ప్రశ్నిస్తున్నారు.

సిండికేట్ అయిన నిర్వాహకులు..

ఇప్పటిదాకా మామిడి గుజ్జు పరిశ్రమల నిర్వాహకులు సిండికేట్ కావడం చూశాం. తాజాగా అదే రీతిలో జిల్లాలోని పాలడెయిరీల యజమానులు సైతం రింగ్‌గా ఏర్పడి ధరలను తక్కువ చేశారనే మాట వినిపిస్తోంది. ప్రస్తుతం జిల్లాలో దొడ్ల, హెరిటేజ్, పరాగ్, తిరుమల, హట్సన్, సంఘం, శ్రీజ లాంటి పాలడెయిరీ నిర్వాహకులు ధరలను శాసిస్తున్నారు.

ప్యాకెట్ పాల ధర మాత్రం పైపైకి..

కంపెనీ బ్రాండ్‌లను బట్టి బహిరంగ మార్కెట్‌లో ప్యాకెట్ లీటర్ పాల ధర రూ.70 ఉండగా, అర్ధలీటర్ రూ.35 ఉంది. అదే రైతు డెయిరీలకు పోసే పాల ధరలు తగ్గుతుండగా మార్కెట్‌లో డెయిరీ పాల ప్యాకెట్ల ధరలు మాత్రం పెరుగుతూనే ఉన్నాయి.

మిగిలేది అంతంతే..

పలమనేరు సమీపంలోని బేరుపల్లికి చెందిన ఓ రైతు రూ.1.20 లక్షలు పెట్టి పది లీటర్ల పాలిచ్చే ఆవును కొన్నాడు. పూటకు(పొద్దున, సాయంత్రం) 20 లీటర్ల పాలను డెయిరీకి పోస్తున్నాడు. రోజుకు లీటర్ రూ.25 లెక్కన రూ.500 వస్తోంది. నెలకు రూ.15 వేలు సంపాదన. ఆ ఆవు సంరక్షణలో భాగంగా నెలకు ఫీడ్‌కు రూ.1500, బూసాకు రూ.1000, గానుగపిండికి రూ.2,000, రైతు కూలి రూ.6 వేలు మొత్తం రూ.10,500 దాకా ఖర్చు వస్తోంది. ఇక గడ్డి ఖర్చు రూ.2 వేలు కలుపుకుంటే రూ.12,500. నెలకు వచ్చే బిల్లు రూ.15 వేలు అయితే అందులో రూ.12,500 పోగా మిగిలేది కేవలం రూ.2,500 మాత్రమే. మధ్యలో ఆవుకు ఏదైనా జబ్బు చేస్తే రైతు చేతి నుంచి పెట్టుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. వచ్చే ఆ కాసింత డబ్బులతోనే రైతు కుటుంబాన్ని పోషించుకోవాలి. ఇలాగైతే ఎలా అప్పులు తీర్చేది ఎలా బతికేదని రైతు ఆవేదన. ఇది కేవలం ఓ రైతు బాధేకాదు పడమటి మండలాల్లోని పాడి రైతుల్లోనూ నెలకొన్న కష్టమే.


కొండెక్కిన పాడి ఆవుల ధరలు..

జిల్లాలో ఎక్కువగా హెచ్‌ఎఫ్, జెర్సీ రకాల సీమజాతి ఆవులను రైతులు కొనుగోలు చేస్తున్నారు. వీటిని రాష్ట్ర సరిహద్దులోని కర్ణాటక, తమిళనాడు నుంచి తేవాల్సిందే. లీటరు పాలు రూ.10 వేలుగా 10 లీటర్ల పాలు ఇచ్చే ఆవును లక్షకు పైగా కొంటున్నారు. బీమా కట్టాలి. పది లీటర్ల పాలు ఇచ్చే ఆవుకు నెలకు 50 కేజీల ఫీడ్, ఓ బస్తా బూసా, 30 కిలోల గానుగపిండి అవసరం ఉంటుంది. వీటి ధరలు మాత్రం అమాంతం పెరుగుతూనే ఉన్నాయి.

అకస్మాత్తుగా ధరల తగ్గుముఖం..

ఎన్నికలకు ముందు దాకా ఫ్యాట్ శాతం 3.5, ఎస్ఎస్ఎఫ్ (సోలిడ్స్ నాట్ ఫ్యాట్) 8.5 నుంచి 9శాతం వచ్చే పాలు లీటర్ ధర రూ.44 ఉండేది. వెన్నశాతం తక్కువగా ఉన్న పాలు లీటర్ ధర కనిష్టంగా రూ.33 వరకు పలికేవి. డెయిరీలకు కెపాసిటీకి మించి పాలు వస్తున్నాయనే సాకుతో నిర్వాహకులు మంచి ఫ్యాట్ ఉన్న పాల ధర ప్రస్తుతం రూ.36 కాగా కనిష్ట ధర రూ.25 పడిపోయింది. ఉన్నట్టుండి లీటర్‌పై రూ.10 దాకా తగ్గడంతో పాడిరైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీంతో పాటు రైతులు డెయిరీలకు పంపిన పాలను సైతం తమకు వద్దంటూ వెనక్కి పంపేస్తున్నారు.


కూలి కూడా మిగల్లేదు..



తన వద్ద 5 ఆవులు ఉన్నాయి. రోజూ 30 లీటర్ల పాలను డెయిరీకి పోస్తున్నా. లీటర్ రూ.44 ఉన్న ధర ఇప్పుడు రూ.30 కంటే తగ్గింది. ఈ రేట్లతో పాడి ఆవులను మేపడం వేస్ట్. ధరల విషయంలో పాల డెయిరీలు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నాయి. పొద్దస్తమానం ఆవులకు చాకిరీ చేసి వాటికి మేత, గానుగపిండి పెట్టి పోషిస్తే మా కూలి కూడా మిగలడం లేదు.

– జయరామిరెడ్డి, పాడిరైతు, బేరుపల్లి, పలమనేరు

మరీ మోసం..



నేను 30 ఏళ్లుగా పాల వ్యాపారం చేస్తున్నా. ఇప్పుడు ఉన్న దాణా ధరలు, పెరిగిన పాడిఆవుల రేట్లతో లీటర్‌కు రూ.40పైన ఉంటేనే రైతుకు గిట్టుబాటు ఉంటుంది. ఈ మధ్య వర్షాల కారణంగా పచ్చిమేత లభ్యమవుతోంది. దీంతో పాల ఉత్పత్తి పెరిగింది. దీన్ని ఆసరాగా చేసుకుని పాల డెయిరీల నిర్వాహకులు తమకు వస్తున్న పాల కంటే అధికంగా వస్తున్నాయని వెనక్కి పంపుతున్నారు. ధరలు కూడా తగ్గించారు. ఇలాగే ఉంటే పాడిపశువులను అమ్ముకోవాల్సిందే.

– పాలు శీనా, పాల ఏజెంట్, బైరెడ్డిపల్లి



పాడి ఆవులు



పాలను సేకరిస్తున్న ఏజెంట్లు

న్యాయ సంహితపై అవగాహన తప్పనిసరి



మాట్లాడుతున్న జిల్లా జడ్జి భీమారావు

చిత్తూరు అర్బన్: భారతీయ శిక్షా స్మృతి (ఐపీసీ) స్థానంలో వచ్చే నెల నుంచి అమలు కానున్న భారతీయ న్యాయశాఖ చట్టంపై ప్రతి న్యాయమూర్తి తప్పనిసరిగా అవగాహన కలిగి ఉండాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఈ.భీమారావు అన్నారు. ఐపీసీ స్థానంలో రూపొందిన భారతీయ న్యాయ సంహిత, భారతీయ నాగరిక్ సురక్షా సంహిత, భారతీయ సాక్ష్య అధినియం అనే చట్టాలపై ఉమ్మడి జిల్లాలోని న్యాయమూర్తులకు శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. చిత్తూరు నగరంలోని జెడ్పీ సమావేశపు హాలులో రెండు రోజుల పాటు జరగనున్న ఈ కార్యక్రమంలో న్యాయమూర్తులకు పరిపాలన, కొత్త క్రిమినల్, సివిల్ కేసులపై జిల్లా ప్రధాన న్యాయమూర్తి భీమారావు అవగాహన కల్పించారు. మారుతున్న నూతన చట్టాలపై ఎప్పటికప్పుడు న్యాయమూర్తులు అప్‌డేట్ కావాలన్నారు. 1860లో రూపొందించిన ఐపీసీ స్థానంలో ఇప్పటికే కొత్త చట్టాలను తీసుకొచ్చిందన్నారు. ఇందులో పలు మార్పులు జరిగాయని.. నిందితులకు పలు సెక్షన్లలో శిక్షాకాలంతో పాటు జరిమానాలు కూడా పెంచారన్నారు. హైదరాబాద్‌లోని నల్సార్ యూనివర్సిటీ, తమిళనాడు వేలూరు విట్ వర్సిటీల నుంచి వచ్చిన న్యాయశాఖ అధ్యాపకులు కెవి కె.శాంతి, డి.శంకర్ రిసోర్సుపర్సన్లుగా హాజరై చట్టాలపై న్యాయమూర్తులతో సుదీర్ఘంగా అవగాహన కల్పించారు. అనంతరం రిసోర్స్ పర్సన్లను జిల్లా జడ్జి దుశ్శాలువతో సన్మానించి జ్ఞాపికలు అందజేశారు. సమావేశంలో జడ్జిలు రమేష్, శాంతి, ఎస్‌పీడీ వెన్నెల, శిరీష్, శ్రీనివాసులు, శిరీష్, వాణిశ్రీ, డి.విజయసారథి రాజు, కె.గురు అరవింద్, ఎన్‌సీ రాఘవేంద్ర, శ్రీదేవి, ఉమాదేవి, మాధవి, షేక్ బాబ్‌జాన్ కీర్తన తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

దుముకురాళ్లలో టీడీపీ నేతల హల్‌చల్

బైరెడ్డిపల్లి: మండలంలోని తీర్థం సచివాలయ పరిధిలోని కైగల్ దుముకురాళ్ల జలపాతం వద్ద పర్యాటకుల సందడి నెలకొనడంతో ఆరునెలల క్రితం ద్విచక్రవాహనాలకు, కార్లకు గేటు వసూలు చేయడం కోసం వేలంపాట నిర్వహించారు. కై గల్ గ్రామానికి చెందిన మోహన్ రూ.1.10 లక్షలకు వేలం దక్కించుకుని సచివాలయ కార్యదర్శి వద్ద రశీదు పొందారు. అయితే గత వారం రోజులుగా కైగల్ గ్రామానికి చెందిన టీడీపీ నేతలు సురేష్, బాలాజీ, రామకృష్ణ అధికారంలో తామ ఉన్నామని, దుముకురాళ్ల జలపాతం వద్ద గేటు తామే వసూలు చేస్తామని దౌర్జన్యం చేస్తూ వసూలు చేస్తున్నాడు. దీంతో బాధితుడు మోహన్ బైరెడ్డిపల్లె పోలీసులకు, సచివాలయ అధికారులకు ఫిర్యాదు చేశారు.

సచివాలయంలో భూవివాదం

పుంగనూరు: భూమిని సర్వే చేసి ఇవ్వమన్నందుకు సచివాలయ ఉద్యోగి తమపై దాడి చేశారని భార్యాభర్తలు ఫిర్యాదు చేసిన సంఘటన మండలంలోని ఏతూరు సచివాలయంలో శుక్రవారం జరిగింది. నల్లూరుపల్లికి చెందిన బాధితులు కౌసల్య, లక్ష్మీపతి విలేకరులకు తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. కౌసల్య దంపతులకు భూమి వ్యవహారం కోర్టులో ఉండడంతో వీటిని సర్వే చేయాలని సర్వేయర్ దేవికను అడిగారు. ఈ సమయంలో కార్యదర్శి నిరంజన్‌రెడ్డి తమను దూషించి, సచివాలయం నుంచి గెంటివేశాడని తెలిపారు. ఈ మేరకు శనివారం పుంగనూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ విషయమై కార్యదర్శి నిరంజన్‌రెడ్డిని విచారించగా కౌసల్య, ఆమె బంధువు రవి కార్యాలయానికి వచ్చి చలానా జమ చేయాలని కోరగా భూమి కోర్టులో ఉన్న కారణంగా ఆన్‌లైన్‌లో రాలేదని, అందువల్ల చలానా జమ చేయలేమని చెప్పామన్నారు. దీంతో వారు తమను ఇష్టానుసారంగా మాట్లాడి బెదిరించారని, తాము ఎలాంటి దౌర్జన్యం చేయలేదని తెలిపారు.

ప్రవేశాల పెంపునకు 'విద్యాప్రవేశం'

చిత్తూరు కలెక్టరేట్ : సర్కారు బడుల్లో విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు విద్యాప్రవేశం కార్యక్రమం నిర్వహించాలని రాష్ట్ర విద్యాశాఖ అధికారులు శనివారం ఉత్తర్వులు జారీచేశారు. ఆ ఉత్తర్వుల మేరకు 4 వారాల పాటు విద్యాప్రవేశం కార్యక్రమం నిర్వహించాల్సి ఉంటుందన్నారు. జిల్లావ్యాప్తంగా ఈ నెల 24వ తేదీ నుంచి జూలై 25వ తేదీ వరకు కార్యక్రమాన్ని సూచించిన నిబంధనల ప్రకారం పకడ్బందీగా నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమాన్ని డీఈఓ, సమగ్రశిక్ష ఏపీసీలు పకడ్బందీగా పర్యవేక్షించాలని సూచించారు. విద్యాప్రవేశం కార్యక్రమం హ్యాండ్‌బుక్, ఎన్‌రోల్‌మెంట్ రిపోర్ట్, ఎన్‌రోల్‌మెంట్ అనాలసిస్, షెడ్యూల్, చేపట్టాల్సిన యాక్టివిటీలను ఆ ఉత్తర్వుల్లో క్షుణ్ణంగా పేర్కొన్నారు.

ఐసీడీఎస్ పీడీపై ఫిర్యాదు

పలమనేరు: ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ నాగశైలజ అవినీతిపై విచారణ చేపట్టాలని ఐసీడీఎస్ ఉద్యో గి ప్రతిమ ఆ శాఖ ముఖ్య అధికారులకు ఫిర్యాదు చేసినట్టు తెలిపారు. శనివారం ఆమె స్థానిక విలేకరులతో మాట్లాడుతూ గతంలో ఆమె ఇక్కడ స్త్రీశిశు సంక్షేమశాఖలో సూపర్‌వైజర్‌గా ఉంటూ కొందరి నేతల పలుకబడితో జిల్లాకు పీడీని రానీయకుండా తనే ఇన్‌చార్జ్ పీడీగా ఉంటూ భారీగా అక్రమాలకు పాల్పడ్డారని ఆరోపించారు. బడ్జెట్‌పై మీటింగ్ పెట్టకుండా అక్రమాలకు పాల్పడినట్టు ఆరోపించారు. దీనిపై తాను కుప్పం పర్యటకు సీఎం చంద్రబాబు వచ్చినప్పుడు మరో దఫా నేరుగా ఫిర్యాదు చేస్తా అని తెలిపారు.

హనుమంతుడిపై శ్రీహరి చిద్విలాసం


హనుమంత వాహనంపై ఊరేగుతున్న శ్రీవారు


గజ వాహనంపై అభయమిస్తున్న గోవిందుడు

పుత్తూరు: అప్పలాయగుంటలో వెలసిన శ్రీప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో ఆరోరోజు శనివారం ప్రసన్న వేంకటేశ్వరస్వామి హనుమంత, గజ వాహనాలపై విహరించారు. పట్టుపీతాంబరాలు, విశేష స్వర్ణాభరణాలతో ముగ్ధ మనోహర రూపంలో గోవిందుడు హనుమంతుడి భుజాలపై ఆశీనుడై అశేష భక్తులను కటాక్షించారు. ఉదయం 5 గంటలకు స్వామివారిని సుప్రభాత సేవతో మేల్కొల్పి విశ్వరూప దర్శనం, తోమాల సేవ, కొలువు, అర్చన, మొదటి గంట తదితర కార్యక్రమాలు నిర్వహించారు. ఉదయం 7.30 గంటలకు శ్రీవారు వాహన మండపంలోకి వేంచేపు చేశారు. 8 నుంచి 9 గంటల వరకు గోవిందుడు హనుమంత వాహనంపై ఊరేగుతుండగా అశేష భక్తుల గోవింద నామస్మరణతో మాడవీధులు మార్మోగాయి. తదుపరి శుద్ధి, రెండవ గంట కార్యక్రమాలు నిర్వహించారు. మధ్యాహ్నం 12 గంటల నుంచి భక్తులను స్వామి దర్శనానికి అనుమతించారు. 3 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పుణ్యాహవచనం, వసంతోత్సవాలను వేద పండితులు వైభవోపేతంగా నిర్వహించారు. శ్రీవారి గ్రామోత్సవం అనంతరం 6.30 గంటలకు స్వామివారు వాహన మండపంలోకి వేంచేపు చేశారు.

గజరాజుపై శ్రీవారి అభయం..

బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం రాత్రి 7 గంటలకు స్వామివారు పట్టు పీతాంబరాలు, విశేష స్వర్ణాభరణాలు, సుగంధ పరిమళభరిత పుష్పమాలికలతో సుందరంగా అలంకరితుడై గజ వాహనంపై విహరిస్తూ భక్తులకు అభయమిచ్చారు. మేళతాళాలు, మంగళవాయిద్యాలు, చిన్నారుల కోలాటాల నడుమ అశేష భక్తజనం స్వామివారిని కనులారా వీక్షించి తరించారు. ఏఈఓ రమేష్, ఆలయ సూపరింటెండెంట్ శ్రీవాణి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాల్లో నేడు..

బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం ఉదయం 8 నుంచి 9 గంటల వరకు సూర్యప్రభ వాహనంపై స్వామివారు దర్శనమిస్తారు. సాయంత్రం 5.30 గంటల నుంచి 6.30 వరకు ఊంజల్ సేవ, రాత్రి 7 గంటల నుంచి 8 వరకు చంద్రప్రభ వాహనంపై స్వామివారు విహరిస్తారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరి మృతి


సాయికృష్ణ(ఫైల్)


ఈశ్వర్ (ఫైల్)

నింద్ర: మండలంలోని కొప్పేడు గ్రామం వద్ద శుక్రవారం రాత్రి ఎదురెదురుగా వచ్చిన రెండు బైక్‌లు ఢీకొన్న ఘటనలో ఇద్దరు మృతి చెందిన సంఘన వెలుగు చూసింది. వివరాలు.. మండలంలోని శ్రీరామపురం గ్రామం దళితవాడకు చెందిన ఈశ్వర్ (47) పుత్తూరు ఆర్టీసీ డిపోలో కాంట్రాక్ట్ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. శుక్రవారం రాత్రి 11 గంటలకు శ్రీరామపురానికి మోటార్ సైకిల్‌పై బయలుదేరాడు. ఇదే గ్రామానికి చెందిన సాయికృష్ణ(20), నవీన్ కుమార్, జశ్వంత్ ముగ్గురు మోటార్ సైకిల్‌పై పాలమంగళం వెళ్తుండగా కొప్పేడు వద్ద ఇరువురి మోటార్ సైకిళ్లు ఢీకొన్నాయి. ఈ ఘటనలో ఈశ్వర్ అక్కడికక్కడే మృతి చెందాడు. మరో బైక్‌పై వచ్చిన సాయికృష్ణ, నవీన్‌కుమార్, జశ్వంత్ తీవ్రంగా గాయపడగా, వారిని పుత్తూరు ఆస్పత్రికి తరలించగా అందులో సాయికృష్ణ మృతి చెందాడు. అక్కడి నుంచి మిగతా ఇద్దరినీ మెరుగైన వైద్యం కోసం తిరుపతికి తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రామచంద్ర తెలిపారు.

24, 25 తేదీల్లో సీఎం కుప్పం పర్యటన

- సీఎం చంద్రబాబు పర్యటన సందర్భంగా పటిష్ట ఏర్పాట్లు చేయండి
- సమావేశంలో కలెక్టర్ షణ్మోహన్, ఎస్పీ మణికంఠ


సీఎం చంద్రబాబు పర్యటన రూట్‌మ్యాప్‌పై చర్చిస్తున్న కలెక్టర్, ఎస్పీ


సమావేశంలో పాల్గొన్న అధికారులు

చిత్తూరు కలెక్టరేట్ : ఎలాంటి లోటుపాట్లు లేకుండా సీఎం చంద్రబాబు పర్యటనకు ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ షణ్మోహన్ ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లోని సమావేశమందిరంలో సీఎం పర్యటనపై జిల్లా అధికారులతో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 25, 26 తేదీల్లో సీఎం చంద్రబాబునాయుడు కుప్పం పర్యటనకు రానున్నట్లు తెలిపారు. సీఎం పర్యటనను విజయవంతం చేసేందుకు అన్ని శాఖల జిల్లా అధికారులు సమన్వయంతో పని చేయాలన్నారు. ఆయా శాఖల అధికారులకు కేటాయించిన విధులను సమర్థవంతంగా నిర్వర్తించాలని సూచించారు. ఈ నెల 25వ తేదీన సీఎం చంద్రబాబు పీఈఎస్ మెడికల్ కాలేజీలో ఏర్పాటు చేసిన హెలీప్యాడ్‌కు చేరుకుంటారని తెలిపారు. అనంతరం హెచ్ఎన్ఎస్ఎస్ కాలువ పనులు పరిశీలన, బహిరంగ సభలో పాల్గొంటారన్నారు. ఆ తర్వాత జిల్లా అధికారులతో సమీక్షిస్తారని తెలిపారు. 25వ తేదీ రాత్రి కుప్పంలో బస చేసి, 26న ఉదయం ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తారని, తర్వాత పలు కార్యక్రమాల్లో పాల్గొంటారన్నారు. అదే రోజు సాయంత్రం విజయవాడకు వెళ్తారని తెలిపారు.

పటిష్ట చర్యలు..

ఎస్పీ మణికంఠ మాట్లాడుతూ సీఎం పర్యటనకు సంబంధించి పటిష్ట భద్రతను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. సీఎం పర్యటించే ప్రాంతాల్లో పటిష్ట బందోబస్తును ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఇప్పటికే ముందస్తు ఏర్పాట్లు పరిశీలించామని చెప్పారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు, డీఆర్‌ఓ పుల్లయ్య, పలు శాఖల అధికారులు రాజశేఖర్, చంద్రశేఖర్‌రెడ్డి, విజయ్‌కుమార్, ఉమామహేశ్వరరెడ్డి, విజయ్‌కుమార్‌రెడ్డి, పద్మనాభం, తులసి పాల్గొన్నారు.

అమ్మా సంస్థ సేవలు ఎనలేనివి



మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు

వి.కోట: పేదలకు అనేక సేవా కార్యక్రమాలు, విద్యార్థుల విద్యాభివృద్ధికి కృషి చేస్తూ ఆదర్శంగా నిలుస్తున్న అమ్మా యాక్ట్స్ సంస్థ సేవలు ఎనలేనివని జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు కొనియాడారు. శనివారం పట్టణంలోని జీఎంఆర్ కల్యాణ మండపంలో జరిగిన అమ్మాయాక్ట్స్ సంస్థ 27వ వార్షికోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఆయనతో పాటు ఎంఈఓ చంద్రశేఖర్, మేజర్ పంచాయతీ సర్పంచ్ పీఎస్ లక్ష్మి, ద్రవిడ యూనివర్సిటీ విశ్రాంత ఉప కులపతి కంకణాల రత్నయ్య పాల్గొన్నారు. సంస్థ అధినేత దశరథరెడ్డి అతిథులకు ఘన స్వాగతం పలికారు. అనంతరం జెడ్పీ చైర్మన్ చేతుల మీదుగా 10వ తరగతిలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను గోల్డ్ మెడల్స్‌తో సత్కరించి, నగదు బహుమతులు ప్రదానం, ప్రోత్సాహకాలు అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వి.కోటలో సంస్థ ఏర్పాటు చేసిన నాటి నుంచి సంస్థ అధినేత దశరథరెడ్డి ఎంతోమందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించారని తెలిపారు. అలాగే ప్రభుత్వ స్కూళ్లకు డెస్కులు, ఆర్‌ఓ వాటర్ ప్లాంట్‌లు సమకూర్చడం, హాస్టల్ విద్యార్థులకు దుప్పట్లు, నోట్‌బుక్‌లు, పబ్లిక్ పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారికి ప్రోత్సాహకాలు, మెడల్స్, నగదు బహుమతులు అందించి విద్యాభివృద్ధికి కృషి చేస్తున్నారని కొనియాడారు.

డయేరియా నియంత్రణకు పటిష్ట చర్యలు

- జూలై 1 నుంచి ఆగస్టు 31 వరకు జిల్లావ్యాప్తంగా ప్రచార కార్యక్రమాలు
- ఆస్పత్రుల్లో మెరుగైన వైద్యసేవలు అందించాలి
- కలెక్టర్ షణ్మోహన్


మాట్లాడుతున్న కలెక్టర్

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లావ్యాప్తంగా డయేరియా వ్యాధి కట్టడికి పటిష్ట చర్యలు చేపట్టాలని కలెక్టర్ షణ్మోహన్ ఆదేశించారు. శనివారం ఆయన కలెక్టరేట్ నుంచి పలు శాఖల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ డయేరియా విషయంలో ఎలాంటి అలసత్వం చేయకూడదని, జిల్లాలోని ప్రభుత్వ ఆస్పత్రుల్లో మెరుగైన వైద్యసేవలు అందించేందుకు వైద్య ఆరోగ్య శాఖ చర్యలు చేపట్టాలని సూచించారు. స్టాప్ డయేరియా కార్యక్రమంలో భాగంగా జూలై 1 నుంచి ఆగస్టు 31 వరకు జిల్లాలో అవగాహన కార్యక్రమాలు విస్తృతంగా చేపట్టాలని ఆదేశించారు. మంచినీటి పైపులైన్లు లీకేజీలు లేకుండా చర్యలు చేపట్టాలని తెలిపారు.

రెండు నెలల పాటు ప్రచార కార్యక్రమాలు..

ఐదేళ్లలోపు చిన్నారులు ఎవరూ జిల్లాలో డయేరియా వ్యాధితో మృతి చెందకూడదనే లక్ష్యంతో పని చేయాలని కలెక్టర్ షణ్మోహన్ ఆదేశించారు. జిల్లాస్థాయిలో ఈనెల 22 లోపు వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో జిల్లాస్థాయి ఇంటర్ సెక్టోరల్ టాస్క్ ఫోర్సు కమిటీని ఏర్పాటు చేయాలని తెలిపారు. ఆర్‌డబ్ల్యూఎస్ శాఖ గ్రామ, మండల, జిల్లాస్థాయిల్లో వాటర్ క్వాలిటీ పరీక్షల కిట్లు అందుబాటులో ఉంచి నీటి నాణ్యత పరీక్షలు నిర్వహించాలన్నారు. కాన్ఫరెన్స్‌లో డ్వామా పీడీ రాజశేఖర్, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

డయేరియాపై నిర్లక్ష్యం వద్దు..

చిత్తూరు రూరల్ (కాణిపాకం): డయేరియా విషయంలో నిర్లక్ష్యం వద్దని, టాస్క్‌ఫోర్స్ టీం విధిగా పని చేయాలని ఇన్‌చార్జ్ డీఎంఅండ్‌హెచ్‌ఓ వెంకట ప్రసాద్ ఆదేశించారు. చిత్తూరు నగరంలోని తన కార్యాలయంలో శనివారం అయన అధికారులతో సమావేశం నిర్వహించారు. ముందుగా రాష్ట్రస్థాయి అధికారులు డయేరియాపై జిల్లా అధికారులకు పలు సూచనలు చేశారు. అనంతరం ఆయన అధికారులతో మాట్లాడుతూ డయేరియా అనుమానిత కేసులు కనిపిస్తే అధికారులు తక్షణం స్పందించి వైద్య సేవలు అందించాలన్నారు. అలాగే ప్రజలకు అవగాన కల్పించాలని సూచించారు.

గణపతి హోమంతో సకల శుభాలు

కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామి దేవస్థానంలో గణపతి హోమ పూజలకు అంత్యత ఆదరణ లభిస్తోంది. భక్తజనం ఈ పూజలకు క్యూ కదుతున్నారు. సాధారణరోజుల కంటే సంకటహర వత్రం రోజున అధిక సంఖ్యలో పాల్గొంటున్నారు. గణపతి హోమంతో కోర్కె లు నెరవేరడంతో పాటు విఘ్నాలు తొలిగి తలపెట్టిన ఏ కార్యమైనా సిద్ధిస్తుందని గణ పతి పురాణం చెబుతోంది. భక్తుల సౌకర్యా ర్థం ఆలయంలో ఉదయం 7 నుంచి మూడు బ్యాచ్‌లుగా ఈ హోమాన్ని నిర్వహిస్తున్నారు. ఆ హోమ విశేషాలపై ప్రత్యేక కథనం.

- 29 ఏళ్ల కిందట కాణిపాకంలో ప్రారంభం
- భక్తుల నుంచి విశేష ఆదరణ
- రోజూ మూడు విడతల్లో నిర్వహణ


కాణిపాకం ఆలయంలో గణపతి హోమం

కాణిపాకం: కాణిపాకం స్వయంభు వరసిద్ధి వినాయకస్వామి ఆలయంలో గణపతి హోమానికి విశిష్టత ఉంది. ప్రజలు ఏ కార్యక్రమానికైన తొలుత గణనాథుడిని పూజిస్తారు. అలా భక్తితో కొలిస్తే ఆయా పనుల్లో విఘ్నాలు తొలగి సక్రమంగా జరుగుతాయని ప్రగాఢ నమ్మకం. పురాణాల ప్రకారం హిందూ సంప్రదాయంలో గణనాథునికి ప్రత్యేక స్థానం ఉంది. ఇక హోమమంటే స్వామికి అత్యంత ఇష్టమమని గణపతి పురాణం చెబుతోంది. కాణిపాకం ఆలయంలో చేసే ఈ గణపతి హోమానికి ఓ విశిష్టత ఉందని ఆలయ పండితులు అంటున్నారు. కాణిపాకం దేవస్థానంలో 29 ఏళ్లుగా గణపతి హోమం నిర్వర్తిస్తున్నారు. ఇక్కడ హోమం ప్రారంభించిన తర్వాత తమిళనాడు, కర్నాట క, కేరళ రాష్ట్రాల్లోని పలు ఆలయాల్లో సైతం ప్రారంభించారు. ఈహోమాన్ని ఇంట్లో కూడా చేసుకోవచ్చు. కానీ స్వయంభు మూర్తి ఉన్న చోట చేస్తే అధిక ఫలితా లు ఉంటాయన్నది భక్తుల విశ్వాసం. దీంతో ఆలయంలో గణపతి హోమం చేసేందుకు భక్తులు ఆసక్తి చూపుతున్నారు. ఉదయం 7 నుంచి మూడు బ్యాచ్‌లుగా ఈ హోమాన్ని నిర్వహిస్తున్నారు. ఆలయ ఆవరణలోని హోమ మండపం వద్ద జరిగే ఈ హోమ పూజల్లో నిత్యం కుటుంబ సమేతంగా పెద్ద సంఖ్యలో పాల్గొంటున్నారు. సంకటహర చతుర్థి రోజు 30 నుంచి 40 మందికిపైగా పాల్గొంటున్నట్లు దేవస్థానం అధికారులు చెబుతున్నారు.

ఏ పనిలోనైనా విజయం..



గణపతి హోమం అంటే సర్వ రోగ నివారణి. ఏ కోరికలున్నా, పనుల్లో ఆటంకాలు, విఘ్నాలున్నా తొలగేందుకు ఈ హోమాన్ని భక్తి ప్రపత్తులతో చేపట్టాలి. కొత్త ఇల్లు లేదా వ్యాపారం ప్రారంభించే ముందు గణపతి హోమం చేస్తుంటారు. అనారోగ్యాలు, మానసిక గందరగోళం, ప్రతికూల ఆలోచనలకు దూరంగా ఉండేందుకు ప్రయోజనకరంగా ఉంటుంది. ఈ హోమంతో ఆర్థిక, విద్య, ఆరోగ్య రంగాల్లో ఆటంకాలు తొలుగుతాయి. పిల్లల చదువుల్లో ప్రగతిని సాధిస్తారు. వివాహం, నిరుద్యోగం, ఉద్యోగంలో ఇబ్బందులు తొలగి విజయం, శ్రేయస్సు వస్తుంది. ఇంట్లో సంతోషాలు లభిస్తాయి.
– ఫణి, అర్చకులు, కాణిపాకం